నవాబుపేటలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుత్తేదారులు రింగ్ అయ్యారని, టెండరు నిలిపివేయాలని ఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఆలయ మాజీ డైరెక్టర్ నరసింహులు

అంగడి వేలంలో సిండికేట్!

- నవాబుపేట కోదండరామాలయం ఆదాయానికి రూ.6లక్షలు గండి
- సంత వేలంలో కాంట్రాక్టర్ల కుమ్మక్కు
- ఈవోకు స్థానికుల ఫిర్యాదు

లింగాలఘనపురం, జూన్ 13 : మండలంలోని నవాబుపేట కోదండరామస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేలం పాటలో గుత్తేదారులు సిండికేట్ అయ్యారు. దీంతో ఆలయానికి రూ.6లక్షల గండి పడింది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఆలయంలో నవాబుపేట అంగడివేలం నిర్వహించినట్లు ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. వేలం ద్వారా రూ.12.50 లక్షల ఆదాయం లభించినట్లు ఆమె తెలిపారు. అంగడి వేలాన్ని రూ.9.35 లక్షలకు గొలుసుల శ్రీనివాస్ దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే, అంగడిలో పగ్గాలు విక్రయించేందుకు వేలం నిర్వహించగా రూ.3.15 లక్షలతో మాలోత్ మధుసూదన్ దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా, అంగడి వేలంలో కాంట్రాక్టర్లు సిండికేట్ అయి ఆలయానికి దక్కాల్సిన రూ.6లక్షలకు గండి కొట్టారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మొత్తం 96మంది టెండర్ ఫారాలు కొనుగోలు చేస్తే కేవలం ఐదుగురు మాత్రమే ఫారాలు దాఖలు చేశారని, గతంలో రూ.9.25లక్షల ఆదాయం రాగా, ఈ సారి కేవలం రూ.10వేలు అదనంగా రూ.9.35లక్షలకు టెండర్లు దక్కించుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా అధికారుల ఎదుటే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. మిగిలిన 91మంది టెండరుదారులకు రూ.6వేలు చొప్పున ముట్ట జెప్పి, ఆలయానికి రావాల్సిన రూ.6లక్షలకు గండి కొట్టినట్లు ఆరోపిస్తున్నారు. మాజీ డైరెక్టర్ మేకపోతుల నరసింహులు గుత్తేదారుల సిండికేట్ విషయమై ఈవోకు ఫిర్యాదు చేశారు. సిండికేట్‌పై ఈవో లక్ష్మీప్రసన్నను వివరణ కోరగా గుత్తేదారులు సిండికేట్ అయిన విషయంతో తమకు సంబంధం లేదన్నారు. మాజీ డైరెక్టర్ మేకపోతుల నరసింహులు ఇచ్చిన ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపిస్తామని, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి సమక్షంలోనే టెండరు ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, సిబ్బంది కుర్రెముల మోహన్, రవితేజ, సరోజని, వసంత, రమేశ్, ఎల్లగౌడ్, లక్ష్మీనరసింహాచార్యులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పలకరించిన తొలకరి

- జిల్లా వ్యాప్తంగా చల్లబడిన వాతావరణం
- సాగుబాట పట్టిన రైతన్నలు
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- దుక్కులు సిద్ధం చేస్తున్న అన్నదాతలు

జనగామ, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : తొలకరి జల్లులు జిల్లాను పలకరించాయి. నైరుతి రుతుపవనాల రాకతో వానాకాలం ప్రారంభమై వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తారు వర్షం పడింది. అదునులో వానలు పడుతుండడంతో సాగుపై రైతుల్లో ఆనందం నెలకొంది. దీంతో జిల్లాలో సాగు సందడి మొదలైంది. రుతుపవనాలు విస్తరించడంతో రానున్న 24 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకొని, తర్వాత కురిసే వర్షాలకు విత్తేందుకు రైతులు పొలంబాట పట్టారు. ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసిన అన్నదాతలు మృగశిర కార్తె ప్రవేశంతో కొన్నిచోట్ల తమ పొలాల్లో విత్తనాలు వేశారు. మొన్నటి వరకు జిల్లాలో అత్యధికంగా 41 నుంచి 43 డిగ్రీల రికార్డు స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రతలు మృగశిర ప్రవేశానికి ముందురోజే ఒక్కసారిగా 37 డిగ్రీలకు తగ్గుముఖం పట్టాయి. రుతు పవనాల ఆగమనంతో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోవడంతో రెండురోజులుగా వాతావరణం చల్లబడి జనాలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు బోర్లు, బావుల కింద నార్లు పోసుకోగా, మరికొన్ని ప్రాంతాల్లో నారుమడుల కోసం పొలం మడి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఓ మోస్తారు వర్షం కురియడంతో ఇప్పటికే దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న రైతులు ఒకటి, రెండు వర్షాలు పడగానే పూర్తిస్థాయిలో విత్తనాలు వేసుకునేందుకు సిద్ధమయ్యారు.

జనగామ పట్టణంలో కురుస్తున్న వర్షం

జిల్లాలో 3.70లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో అన్ని రకాల పంటలు మొత్తం 3.70 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా 2.10 ఎకరాల్లో వరి పంట, 1.45 లక్షల ఎకరాల్లో పత్తి, 10వేల ఎకరాల్లో కంది, 5వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని చెబుతున్నారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,76,625 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని, అందులో 1.90లక్షల ఎకరాల్లో వరి, 1.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని పేర్కొన్నారు. ఈ సారి మాత్రం వరి పంట అంచనా పెంచి.. పత్తి సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తూ మార్పులు చేశారు. ఇప్పటికే పత్తి, వరి, కంది విత్తనాలు, ఎరువులు జిల్లాలోని డీలర్లకు చేరాయి.

మండలాల వారీగా..

మండలం	ఎకరాలు
జనగామ	28,980
బచ్చన్నపేట	32,900
నర్మెట	21,500
తరిగొప్పుల	18,850
పాలకుర్తి	47,310
కొడకండ్ల	23,800
దేవరుప్పుల	38,150
స్టేషన్‌ఘన్‌పూర్	27,240
చిల్పూరు	24,390
జఫర్‌గఢ్	27,900
లింగాలఘనపురం	32,750
రఘునాథపల్లి	46,230
మొత్తం	**3,70,000**

వానాకాలం సాగు అంచనా విస్తీర్ణం(ఎకరాల్లో)

పంట	ఎకరాలు
వరి	2.10 లక్షలు
పత్తి	1.45 లక్షలు
కంది	10 వేలు
ఇతరాలు	5వేలు

విత్తనాలు, ఎరువులు సిద్ధం

ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సాగు పనులను చేపట్టాలి. అయితే, పూర్తిస్థాయిలో వర్షాలు కురవక ముందే రైతులు తొందరపాటుగా విత్తనాలు వేసి నష్టపోవద్దు. వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

-వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాషా

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని రాఘవాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, ఫర్నిచర్‌ను పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల పునఃప్రారంభం నాటికి సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలనుకున్నామని, కాని కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదన్నారు. త్వరగా వాటిని పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. అలా గే, బడి బాట ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కొమురయ్య, ప్రధానోపాధ్యాయుడు రాజాహన్మంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 13 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలిచేలా పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. గురువారం మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్ ఆధ్వర్యంలో నియోజవకవర్గ కోఆర్డినేటర్ ఆకుల కుమార్, చాగల్లు ఎంపీటీసీ కనకం స్వరూపాగణేశ్, మండల యూత్ నాయకుడు గుండె రంజిత్ హనుమకొండలో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామాల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పార్టీని బలోపేతం చేయాలని రాజయ్య సూచించినట్లు వారు తెలిపారు.

అంధుల పాఠశాలలో
ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, జూన్ 13 : కరీంనగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ బీ నర్మద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న విద్యార్థులు పాఠశాలలో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94943 17315, 97011 90124, 73962 06959, 94403 38424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను
★HIV Prevention Programలో పని చేయుటకు అనుభవం గల Female GNM & ORWలు కావలెను. Send your Resume on or before 15/6/2024, rdmm.wgl@gmail.com, Cont: 9849688581, 9959711470.
NTW-323319

CHANGE OF NAME
★I, SHARMIN SHAMSHUDDIN, R/o. 8-9-183, Polavari Street, Sadashiva Nilayam, Warangal, Telangana. Changed My Name as SHARMIN DHANANI, Daughter of Shamshuddin Sultan Ali.
NT-333711

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

బియ్యం అందజేత

బచ్చన్నపేట, జూన్ 13 : మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన బుర్రి లచ్చమ్మ మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, పిన్నింటి కావ్యశ్రీరెడ్డి కలిసి గురువారం 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బుర్రి రాములు, జిల్లా రైతు సంఘం నాయకులు పిన్నింటి నారాయణరెడ్డి, గ్రామ అధ్యక్షుడు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, నాయకులు కనకసేనారెడ్డి, మల్గ సిద్ధులు, కమలాకర్‌రెడ్డి, బాలు, గుండ నర్సింహులు, శ్రీను, నక్క సిద్ధులు, ఉర్మిళ, రమేశ్, నర్సింహాచారి, కరుణాకర్, దిలీప్, మధు పాల్గొన్నారు.

సంఘటనా స్థలంలో హద్దురాళ్లను పరిశీలిస్తున్న ఏఈ శ్రావణి

దేవాదుల భూమి విక్రయం !

హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 13 : మండలంలోని మీదికొండ గ్రామంలో దేవాదుల కాలువకు సంబంధించిన భూమిని కొంత మంది గ్రామస్తులు విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. కాలువ పక్కన ఉన్న ప్రైవేట్ స్థలంతో పాటు దేవాదులకు సంబంధించిన మూడు గుంటల భూమిని స్థానికులు కొందరు విక్రయించారు. దీంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి గురువారం పాత హద్దు రాళ్లను తొలగించి, కొత్త రాళ్లు ఏర్పాటు చేస్తుండగా స్థానికులు ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో హద్దులు ఏర్పాటు చేస్తుండడంతో విషయాన్ని దేవాదుల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఈ శ్రావణి వచ్చి ప్రభుత్వ భూమి హద్దులను చూపించి హద్దు రాళ్లు ఏర్పాటు చేయించారు. కాగా, దేవాదుల భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

డీఈవో రామును సన్మానిస్తున్న జిల్లా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు

డీఈవో రాముకు సన్మానం

జనగామ చౌరస్తా, జూన్ 13 : తమను త్వరగా రెన్యువల్ చేసినందుకు కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్(పీటీఐ) గురువారం డీఈవో రామును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పీటీఐలు నిబద్ధతతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పీటీఐ సంఘం జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్ మాట్లాడుతూ విద్యాబోధన కోసం అవసరమైన కుట్టు మిషన్లు, మెటీరియల్ అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుపతి, కోశాధికారి రమణ కుమార్, భిక్షపతి, మహేందర్, అరుణ, రజిత, శారద, శిరీష పాల్గొన్నారు.

వేలం పాటలో పాల్గొన్న డీఏవో వినోద్‌కుమార్

అంగడి వేలం వాయిదా

బచ్చన్నపేట, జూన్ 13 : మండల కేంద్రంలోని బచ్చన్నపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం అంగడి వేలం పాట నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి, గ్రామ ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, బీసీ చక్రధర్, అశోక్ పాల్గొన్నారు. అంగడి వేలం, తై బజార్, దక్కాకు గాను నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు వేలం పాట పాడక పోవడంతో శనివారం నాటికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ మురళి, పంచాయతీ సిబ్బంది మల్లేశ్ పాల్గొన్నారు.

'కేటీఆర్‌పై కక్షతో నేతన్నలకు ఉపాధి కరువు'

పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన కృష్ణ భార్గవ

జనగామ చౌరస్తా, జూన్ 13 : మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో నేతన్నలకు ఉపాధి కరువైందని పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎక్కలదేవి మోహన కృష్ణ భార్గవ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి సిరిసిల్ల మర నేత కార్మికుల కష్టాలను తెలుపుతూ గురువారం బహిరంగ లేఖను విడుదల చేశారు. వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ 'సిరుల'సిల్లగా వెలుగొందిన సిరిసిల్ల ఇవాళ ఉపాధి కోల్పోయి, నేతన్నల వలసలు వెళుతున్న పరిస్థితి కనిపిస్తుందని తెలిపారు. ఆర్థిక నష్టాలతో నేతన్నలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న దయనీయ పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. బతుకమ్మ చీరెలు, మైక్రో, తమిళనాడు స్కూల్ యూనిఫారాలతో కార్మికులందరికి చేతినిండా పని ఉండేదని తెలిపారు. గతేడాది ప్రభుత్వం 95.90 లక్షల బతుకమ్మ చీరెలకు ఆర్డర్ ఇచ్చిందని పేర్కొన్నారు. సిరిసిల్ల నుంచి సుమారు రూ.3 వేల కోట్ల ఉత్పత్తి జరిగినట్లు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు బతుకమ్మ చీరెలకు ఆర్డర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ముందస్తుగా అందాల్సిన నిధులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. బతుకమ్మ చీరెలకు సంబంధించి ఎలాంటి జీవో కూడా వెలువడలేదని, మైక్రో, యూనిఫాంలు ఊసే తీయడం లేదని విమర్శించారు. దీంతో సిరిసిల్ల నేడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని పేర్కొన్నారు. నేత కార్మికులకు ఉపాధి లేకుండా చేసి, ఆర్థికంగా హింసించి, మరమగ్గాలని మూయించి, వారి మరణానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కారణమవుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బతుకమ్మ చీరెలు, మైక్రో, స్కూల్ యూనిఫారాలకు ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

బచ్చన్నపేట : మాట్లాడుతున్న కార్యదర్శి రూపావైతన్య

జనగామ చౌరస్తా, జూన్ 13 : వర్షాకాలంలో జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జడ్పీ సీఈవో అనిల్ కుమార్‌తో కలిసి అంటువ్యాధుల నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పింకేశ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజలు ముందస్తు జాగ్రత్త తీసుకునేలా వారిని చైతన్యపర్చాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

బచ్చన్నపేట : ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోడవ టూరు పంచాయతీ కార్యదర్శి బృంగి రూపావై తన్య సూచించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తా చెదారాన్ని పరిసరాల్లో వేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌కే అందించాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రేమలక్ష్మి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి : డీఎల్‌పీవో

తమ్మడపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పార్థసారథి

బచ్చన్నపేట, జూన్ 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను మరింత వేగవంతం చేయాలని డీఎల్‌పీవో పార్థసారథి సూచించారు. గురువారం మండలంలోని తమ్మడపల్లిలో ఆయన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేటాయించిన ఉద్యోగులు ఉదయాన్నే సర్వే ప్రారంభించాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, నారాయణపూర్‌లో ఎంపీడీవో రఘురామకృష్ణ మిషన్‌భగీరథ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవీప్రసాద్, సౌజన్య, కారోబార్లు, ఫీల్డు అసిస్టెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

మహదేవపూర్, జూన్ 13 : తమకు న్యాయం చేయాలని ఓ ప్రేమ జంట గురువారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లాకు చెందిన వర్షిత నర్సింగ్ పూర్తి చేసి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్నది. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ పానిగంటి వెంకటేశ్ దవాఖానకు రోగులను తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో వీరిద్దరికి పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈనెల 9న వివాహం చేసుకున్నారు. యువతి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో గొడవలకు దిగారు. దీంతో వారు తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. సీఐ రాజేశ్వర్, ఎస్సై భవానిసేన్ ప్రేమికులు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

'ఇసుక అనుమతులను రద్దు చేయాలి'

దేవరుప్పుల, జూన్ 13 : మండలంలో ఇసుక తరలింపును రద్దు చేయాలని ఉస్మానియా టీజాక్ ఆవిర్భావ కమిటీ సభ్యుడు ఇప్ప పృథ్వీ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం పలువురు నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇసుక తరలింపుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కొందరు జిల్లా అధికారులు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని, రూ.కోట్లతో పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిబంధనల మేర గోదావరి నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. చిన్న తరహా నీటి వనరుల నుంచి ఇసక తరలిస్తే భూగర్భజలాలు అండుగంటి పోతాయన్నారు. రైతుల నుంచి ప్రతిఘటన ఎదురవుతున్న నేపథ్యంలో కలెక్టర్ తక్షణం ఇసుక అనుమతులు రద్దు చేయాలని కోరారు.

మంత్రాల నెపంతో మహిళ పై దాడి


సత్తెమ్మను 108వాహనంలో తరలిస్తున్న కుటుంబసభ్యులు

నర్మెట, జూన్ 13 : మంత్రాలు చేస్తుందనే నెపంతో ఓ మహిళ తలపై గొడ్డలితో దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నర్మెట ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెటకు చెందిన నక్కల రవి కుటుంబసభ్యులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో తమపై నక్కల సత్తెమ్మ మంత్రాలు చేస్తుందనే అనుమానంతో బుధవారం రాత్రి రవి గొడ్డలితో ఆమె తలపై దాడి చేశాడు. దీంతో చుట్టుపక్కల వారు గమనించి ఆమెను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సత్తెమ్మ కుమారుడు అంజయ్య ఫిర్యాదు మేరకు రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రాజీవ్ చౌరస్తాలో షాపులను తనిఖీ చేస్తున్న ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి

గుట్కా, గంజాయి విక్రయిస్తే కేసులు

పాలకుర్తి రూరల్, జూన్ 13 : నిషేధిత గుట్కాలు, గంజాయి, డ్రగ్స్ విక్రయించినా, సరఫరా చేసినా కేసులు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. గురువారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు సీఐ గట్ల మహేందర్‌రెడ్డితో కలిసి కిరాణం, పాన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, మట్కా, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గుట్కాలు విక్రయించినా, గంజాయి సరఫరా చేసినా డయల్ 100కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ఎం సాయి ప్రసన్నకుమార్, లింగారెడ్డి, రాజ్ కుమార్, తిరుపతి, యాకయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, సంపత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లి స్కూల్ హెచ్ఎంగా కుసుమ రమేశ్

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 13 : మండలంలోని శివునిపల్లి బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా కుసుమ రమేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని నమిలిగొండ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఏగా పనిచేస్తున్న రమేశ్ ఉద్యోగోన్నతిపై హెచ్ఎంగా ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు బాలికల హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ప్రవీణ్, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం తహసీన్, ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

కొడకండ్ల, జూన్ 13 : మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు గ్రీన్‌కో సంస్థ, జీలేష్ సోలార్ పవర్ ప్లాంట్ మేనేజర్లు వాక ప్రసాద్, మధుప్రియ, సహోద్యుగులతో కలిసి గురువారం రూ.55వేల విలువైన ప్రొజెక్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దోర్నం ప్రభాకర్, సంస్థ ఉద్యోగులు నరేశ్, మురళి, దామోదర్, సంగం శ్రీనివాస్, జానకీరామ్, కిరణ్, భానుచందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే, ఎంపీటీసీ, టీఎస్ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య తన తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు అన్నదానం చేశారు.

ప్రొజెక్టర్‌ను అందజేస్తున్న దాతలు

ఇరిగేషన్ ఈఈపై విచారణ జరిపించాలి

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి